## 1987 దీపావళి మినీ కథల పోటీలో రూ. 75 గెలుపొందిన రచన




రాత్రి పది గంటలు. ట్రైను జోరుగా పోతూంది. శీతాకాలం చల్లటి గాలి కిటికీ సందుల్లోంచి లోపలకి జొరబడి గిలిగింతలు పెడుతుంది.

అంతవరకూ ఎదురుగా వున్న ఆ అమ్మాయి అందాన్ని చూస్తూ లొట్టలేస్తున్న నాకు అంతరాయం కలిగింది.

ఎలా అంటే — పై బెర్తు మీద నిద్రపోవడానికుప క్రమిస్తున్న వ్యక్తి లైటు ఆఫ్ చేసాడు.

బెడ్ లేంపు వెలుతురులో అదోరకమైన వింత అందాన్ని సంతరించుకుంది ఆ అమ్మాయి.

నిద్ర వస్తున్నా, బలవంతాన ఆపుకుని జేబులోంచి సిగరెట్టు తీసి, ముట్టించి పొగ పీల్చి వదిలాను. కొంచెం వెచ్చగా వుంది.

అప్పుడే ఆ అమ్మాయి పైట భుజం చుట్టూ తిప్పి కప్పుకుంది. నావైపు చూస్తున్న ఆమె మొహంలో, ఆ అందమైన కళ్ళలో ఎన్ని భావాలు... అలాగే చూస్తూ ఊహాలోకాల్లో విహరిస్తున్నాను...

గోదావరి బ్రిడ్జి మీంచి పోతోంది ట్రైను. కిటికీ తెరచి నదిని చూడ్డానిపించింది. లేచి తెరవబోయే సరికి — ఆమె కూడా ఆ కిటికీ దగ్గరకే వచ్చింది.

అనుకోకుండా ఆమె చేయి నా చేతిని స్పృశించింది! నా గుండె ఝల్లుమంది!!

ఏదో తీయని అనుభూతి.

వెన్నెల్లో గోదావరి ప్రియుని కోసం నిరీక్షిస్తున్న ప్రియురాలిలా విరహంతో వేగిపోతున్నట్టు కనిపించింది.

ఆమె ఒక పొడుగాటి బ్రౌన్ కలరు కవరు తన హేండ్ బ్యాగ్‌లోంచి తీసి కిటికీలోంచి నదిలోకి విసిరేసింది. తృప్తిగా నిట్టూర్చి వచ్చి తన సీట్లో కూర్చుంది.

కంపార్టుమెంట్‌లో అందరూ దగ్గర దగ్గర నిద్ర పోయారు. నాకు నిద్రరావడం లేదు.

కళ్ళ ముందర అంతటి అందాన్ని అలాగే వదిలేసి నిద్రపోవాలంటే నా బ్రహ్మచారి కుర్ర మనసు ఒప్పడం లేదు.

అదలా వుంచితే ఆ అమ్మాయి ఎందుకు ఆ బరువైన, దళసరి కవరు గోదాట్లోకి విసిరేసింది? ఏదైనా కారణం వుందా? వుంటే ఏమిటి?

అయినా కవరు నదిలో వేయడం ఏమిటి? ఎవరయినా సాధారణంగా డబ్బులు విసురుతారు. లేకుంటే ఏ కొబ్బరి చిప్పో, కుంకమో భక్తిపూర్వకంగా విసిరి చేతులు జోడిస్తారు.

ఆమె చేసిన పని నాకు వింత గొలుపుతోంది? కొంపతీసి రచయిత్రి కాదు కదా! మొదటి రచన గోదావరిలో వేస్తానని మొక్కుకుందా?

అసలు ఎందుకు వేసింది ఆ కవరు? అడిగితే చెప్తుందా? ఒకవేళ "మీ కెందుకు?" అనంటే! ఫరవా లేదు! కాని ఈ రాత్రివేళ ఆమెను ఏదో చెయ్యబోయానని గొడవపెడితే నా ఎముకలు సున్నంలోకి మిగలవు. ఎందుకొచ్చిన తంటా అని ఊరుకోలేక పోతున్నాను.

నా బుర్రనిండా సవాలక్ష ప్రశ్నలు...

ఆ కవరు నాకో మిస్టరీగా తయారయింది. ఏదయితే అదయింది అని ఆమెను అడిగి నా సందేహ నివృత్తి చేసుకుందామనుకునేసరికి ఆమె ఎప్పుడు జారుకుందో నిద్రలోకి జారుకుంది.

హాయిగా నిద్రపోతోంది.

ఆలోచిస్తూ, ఆలోచిస్తూ నేను కూడా అశాంతిగా ఎప్పటికో నిద్రాదేవి ఒడిలోకి జారిపోయాను.

* * *

తెల్లతెల్లవారుతుండగా తెలివొచ్చింది.

ఎదురుగా చూస్తే ఆమె లేదు.

బహుశ దిగిపోయుంటుంది. ఆ కవరు గురించి ఒక్క మాటయినా చెప్పకుండా వెళ్ళిపోయింది.

ప్చ్! ఏం చేస్తాం?

ఆమె ఎవరో నేను ఎవరో! నాతో ఎందుకు చెబుతుంది? దానిని గురించి మరవలేక మరవలేక మరిచాను.

సికింద్రాబాద్ స్టేషను వస్తోంది. నేను దిగాల్సింది అక్కడే. నా దుప్పటి మడత పెట్టుకోబోతుంటే ఓ చిన్న కాగితం కనిపించింది. ఆత్రంగా తీసి చదివాను —

'చూడండీ! మీరు నాతోబాటు వైజాగ్‌లో ఎక్కారు. ఎక్కిన దగ్గర్నుంచి అన్నీ మర్చిపోయి, మరే పనీ లేనట్లు నన్నే తదేకంగా చూడడం మొదలుపెట్టారు.

మీ చూపులు నన్ను ఎంతో ఇబ్బందికరమయిన పరిస్థితికి గురిచేశాయి.

ఈ రాత్రి వేళ మీ ఏకాగ్రతని మరల్చడంకోసం నా భద్రత దృష్ట్యా చేసిన ప్రయత్నమే ఆ కవరు. అది దేనికీ పనికిరానిది. అందుకే గోదావరిలో పడేసాను.

దయచేసి ఇంకెప్పుడూ ఎవరినీ కూడా ఇలా ఇబ్బంది పెట్టొద్దు.